క్లుప్తంగా

ఉత్సవాల నిర్వాహకులతో డీఎస్పీ సమీక్ష


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రేణిగుంట: రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులతో సోమవారం డీఎస్పీ శ్రీనివాసరావు, అర్బన్ సీఐ జయచంద్ర సమావేశం నిర్వహించారు. చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, అధిక శబ్దం వచ్చే డీజేలు వాడరాదని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఊరేగింపు, నిమజ్జనంలో ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు, పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ


దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని పలు వ్యవసా య ఎరువుల దుకాణాలను వ్యవసాయశాఖ ఏడీఏ డాక్టర్ పి అనసూయ, సీఐ ఏవీ రమణ, విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ సోమవారం తనిఖీ చేపట్టారు. యూరియా నిల్వలపై దుకాణాల్లో ఆరా తీశారు. పట్టణంలోని పాతబస్టాండ్ సమీ పం వద్ద ఉన్న మనగ్రోమోర్ షాపులో యూరి యా నిల్వలు, లైసెన్సు, రికార్డులు నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుజాత, పోలీసు సిబ్బంది జయరామిరెడ్డి పాల్గొన్నారు.

మాతృశాఖకు అదనపు కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి కార్పొరేషన్ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి మాతృశాఖకు వెళ్లారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆడిట్ విభాగం నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం ఆయనను మాతృ శాఖకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ అదనపు కమిషనర్‌గా మరొకరిని నియమించకపోవడంతో కమిషనర్ మౌర్య రిలీవ్ చేయలేదు. సోమవారం ఈ మేరకు మంత్రి నారాయణను కలిసేందుకు వచ్చిన చరణ్‌తేజ్‌రెడ్డిని నువ్వు ఇంకా రిలీవ్ కాలేదా అని మంత్రి ప్రశ్నించారు. అనంతరం మంత్రి ఆదేశాలతో కమిషనర్ మౌర్య స్పందించారు. చరణ్‌తేజ్‌రెడ్డిని రిలీవ్ చేస్తూ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు ఇచ్చారు. అదనపు కమిషనర్ ఇన్‌చార్జి బాధ్యతలను డిప్యూటీ కమిషనర్ అమరయ్యకు అప్పగించారు.

శాస్త్రోక్తంగా వరాహస్వామి జయంతి


వరాహస్వామివారి ఆలయం

తిరుమల : తిరుమలలోని శ్రీ భూ వరాహస్వామివారి ఆలయంలో సోమవారం ఉదయం వరాహ జయంతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం కలశస్థాపన, కలశ పూజ, పుణ్యాహవచనం చేపట్టారు. అనంతరం వేదమంత్రాల నడుమ మూలమూర్తికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో విశేష అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం పాల్గొన్నారు.

కపిలేశ్వరాలయంలో చవితి వేడుకలు రేపు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో బుధవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు సాయంత్రం 5.30 గంటలకు మూషిక వాహనంపై గణేశుని కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపించనున్నారు. అలాగే తిరుమల రెండో ఘాట్‌రోడ్డులోని గణపతి ఆలయంలో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు విశేషాభిషేకం చేశారు.

భౌ..బోయ్..!

- ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న శునకాలు
- వీధుల్లో తిరగడానికి భయపడుతున్న జనం
- వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలో కుక్కల ధాటికి బెంబేలెత్తుతున్న వైనం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పంచాయతీ అధికారులు


వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలో హల్‌చల్ చేస్తున్న వీధి కుక్కలు

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలో వాసులు కుక్కల ధాటికి భయపడిపోతున్నారు. వీధుల్లో గుంపులుగా తిరుగుతూ వాహనదారులతో పాటు పాదచారుల పైకి దాడికి దిగుతున్నాయి. కుక్కల ధాటికి.. మరీ ముఖ్యంగా ద్విచక్ర వాహనాల్లో వెళ్తున్న పలువురు ప్రమాదాలకు గురై గాయపడుతున్నారు. ప్రధానంగా రాత్రివేళల్లో వరదయ్యపాళెంలోని పలు వీధుల్లో కుక్కల దాడి ఎక్కువగా ఉంటోంది. దీనికితోడు రాత్రివేళల్లో కుక్కలు గట్టిగా అరుస్తూ నిద్రాభంగం కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలు ఆడుకుంటుంటే.. !

ప్రధానంగా వీధుల్లో గుంపులు గుంపులుగా చేరుతున్న కుక్కలు రాత్రిపూట రెచ్చిపోతున్నాయి. ఇళ్ల ముందు అపరిశుభ్రం చేస్తున్నాయంటూ మహిళలు వాపోతున్నారు. ఉదయం లేవగానే వాటిని శుభ్రం చేయలేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట కుక్కలు ఒక గుంపు పైకి మరో గుంపు దాడులు చేసుకుంటున్నాయి. ఇళ్ల ముందు చిన్నపిల్లలు ఆడుకుంటుంటారని.. వారిపై దాడి చేస్తాయేమోనని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలు కలిగిస్తున్న ఆటంకం గురించి పంచాయతీ అధికారులకు ఎన్నిమార్లు మొర పెట్టుకున్నా కనీస చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఏదైనా పెను ప్రమాదం జరిగితే తప్ప అధికారులు పట్టించుకునేలా లేరని స్థానికులు వాపోయారు.

ఈ ప్రాంతాల్లో కుక్కలు హల్‌చల్..

వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలోని పలు వీధుల్లో వీధి కుక్కలు హల్‌చల్ చేస్తున్నాయి. ఆ మేరకు స్థానికులు పేర్కొన్న విధంగా విజ్ఞాన్‌నగర్, బీసీకాలనీ, గోవర్ధనపురం, గోపాలరావు కాలనీ, శాటిలైట్ కాలనీ, బజారు వీధి, హైస్కూల్ గిరిజన కాలనీ, చెన్నవారిపాళెం దళితవాడ, వరదయ్యపాళెం దళితవాడ, వడ్డిపాళెం, బలిజపాళెం, డొంక వీధి తదితర వీధుల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నట్లు స్థానికులు వాపోతున్నారు.

డిప్యూటీ ఎంపీడీఓ బదిలీ


మధుసూదన్

వరదయ్యపాళెం: మండల డిప్యూటీ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మధుసూదన్‌ను శ్రీకాళహస్తి ఈటీసీ ట్రైనింగ్ సెంటర్‌కు బదిలీ చేశారు. ఆయనకు జిల్లా కలెక్టర్ నుంచి బదిలీ ఉత్తర్వులు రావడంతో సోమవారం బదిలీ చేసినట్లు ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా బదిలీ అయిన డిప్యూటీ ఎంపీడీఓ మధుసూదన్‌కు శ్రీకాళహస్తిలోని ఈటీసీ ట్రైనింగ్ సెంటర్‌లో సీనియర్ ఫ్యాకల్టీ మెంబర్‌గా పోస్టింగ్ ఇచ్చినట్లు చెప్పారు. ఆయన స్థానంలో మండల డిప్యూటీ ఎంపీడీఓగా వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ ఈఓ బసిరెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు.

29న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయాన్ని ఈ నెల 29వ తేదీ శుక్రవారం ఉదయం 7గంటలకు ఆలయ ఆవరణలోని కొట్టు మండపంలో లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బాపిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధిగా హాజరు కావాలన్నారు.

విమర్శలకు తావిచ్చిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- సర్పంచ్‌కు సమాచారం ఇవ్వని వైనం
- టీడీపీ నేతల రాజకీయ ప్రసంగాలు
- అధికారుల ప్రేక్షక పాత్ర

రేణిగుంట: పట్టణంలోని 9వ చౌక దుకాణం వద్ద సోమవారం తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అయితే ప్రభుత్వ కార్యక్రమాన్ని పంచాయతీ ప్రథమ పౌరుడైన సర్పంచ్‌కు కనీస సమాచారం ఇవ్వకుండా పార్టీ కార్యక్రమంగా నిర్వహించడం, స్టేజి మీద టీడీపీ నాయకులు ఆశీనులై అధికారుల సమక్షంలోనే రాజకీయ ప్రసంగాలు చేయడం విమర్శలకు తావిచ్చింది. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రభురావు, డీటీలు శ్యాంప్రసాద్, దిలీప్, ఆర్ఐ జయకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా తదితర నాయకులు పాల్గొన్నారు.


వరదయ్యపాళెంలో..

అక్రమాలకు కళ్లెం..

వరదయ్యపాళెం: క్యూఆర్ కోడ్ స్మార్ట్ రేషన్‌కార్డుల ద్వారా రేషన్ దుకాణాల్లో అక్రమాలకు కళ్లెం పడుతుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సోమవారం మండలంలోని 14480 మందికి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ సుధీర్ రెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్, ఆర్ఐ నల్లయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు ఢిల్లీప్ రాయల్, జనసేన నేత తడ శ్రీను పాల్గొన్నారు.


రేణిగుంట: స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నాగలాపురంలో..

నాగలాపురం: క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తహసీల్దార్ హనుమాన్ నాయక్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శేఖర్, వీఆర్వో నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో 11,245 మందికి క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్టు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డులను కార్డుదారులకు పంపిణీ చేశారు.

రాళ్ల క్వారీ, క్రషర్ యాజమానులకు నోటీసులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, పీవీకండ్రిగ, పుత్తేరి, కత్తివారికండ్రిగ, రెడ్డిగుంటబాడవ, పట్టాభి గిరిజన కాలనీ గ్రామాలకు కేటీరోడ్డు నుంచి వెళ్లే రోడ్డు దెబ్బతినడానికి కారణమైన రాళ్ల క్వారీ, క్రషర్ల యాజమానులకు నోటీసులు ఇవ్వాలని సోమవారం గ్రామ కార్యదర్శి పెంచలయ్యను ఎంపీడీఓ వెంకటరత్నమ్మ ఆదేశించారు. రోడ్డు వెంబడి రాళ్ల క్రషర్లు, క్వారీలు ఉన్నాయని, క్రషర్లు, క్వారీల నుంచి లారీల్లో 50 టన్నులకు పైగా బరువున్న రాళ్ల మెటల్ నింపుకుని తీసుకుపోతుండడంతో రోడ్డు దెబ్బతింది. ఈ రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడడంతో అధ్వానంగా తయారైందని గ్రామస్తులు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ వెంకటరత్నమ్మ రోడ్డుపై ఓవర్‌లోడుతో మెటల్ లారీలు తిప్పకూడదని క్వారీ, క్రషర్ యాజమానులకు నోటీసులు ఇచ్చి, చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శి పెంచలయ్యను ఆదేశించారు.


ఎంపీడీఓకు నోటీసులు చూపుతున్న గ్రామకార్యదర్శి పెంచలయ్య

నాణ్యమైన రుచికరమైన భోజనం పెట్టాలి


విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈఓ మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో అమలు అవుతున్న డొక్కాసీతమ్మ మధ్యాహ్న పథకంలో మెనూ ప్రకారం నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని, వంట నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని ఎంఈఓ-2 మునిసుబ్రమణ్యం తెలిపారు. ఆయన సోమవారం మధ్యాహ్నం కనమనంబేడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని తెలిపారు. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తెత్రిపాడు, చల్లమాంబపురం, తంగెళ్లపురం, నీర్పాకోట, తలారివెట్టు, వీఎస్‌పురం, కంచనపుత్తూరు, కనమనంబేడు, బీఎస్‌పురం గ్రామ రెవెన్యూల్లో భూముల రీసర్వే శరవేగంగా జరుగుతుందని తహసీల్దారు శ్రీదేవి తెలిపారు. ఆమె సోమవారం భూముల రీసర్వేపై గ్రామ సచివాలయాల సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూముల రీసర్వే కోసం భూములకు సంబంధించిన రికార్డులను పక్కాగా సిద్ధం చేసినట్లు తెలిపారు. భూవివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే రైతులకు ఓ వరమని, రైతులు భూముల రీసర్వేకు సహకరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 100 ఏళ్ల తర్వాత గ్రామీణ, పట్టణ, ప్రాంతాల్లో వ్యవసాయ, గ్రామకంఠం స్థిరాస్తుల సర్వే జరుగుతుందన్నారు. భూముల రీసర్వేలో అన్ రిజిష్టర్, వంశపారంపర్యం భూములను గుర్తించి రికార్డుల్లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. భూమి కొలతలు పక్కాగా ఉంటాయని, హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తారని తెలిపారు. కుమ్మర వెంకటపురం గ్రామ రెవెన్యూలో భూసర్వే పూర్తయిందన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీదేవి

ముక్కంటి సేవలో ఎంపీ కృష్ణప్రసాద్



శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పెంచలకోనలో మృతదేహం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాపూరు: మండలంలోని పెంచలకోన అటవీశాఖ అతిథి గృహం సమీపంలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు సోమవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించి పెంచలకోనలోని అవుట్‌పోస్టుకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి సుమారు 45 ఏళ్ల వయసుంటుందని చెప్పారు. సమీపంలో గడ్డిమందు బాటిల్ ఉండడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు.

ఘనంగా శాంతారామ్ పవార్ జయంతి


శాంతారామ్ పవార్ విగ్రహం, చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఒక ప్రైవేటు స్కూల్ ఆవరణలో సోమవారం శాంతారామ్ పవార్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి కుమార్తె డాక్టర్ అర్చన, సోదరుడు జనార్ధన్‌రావ్ పవార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు పవార్ సేవలను స్మరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా ప్రజల కోసం, భక్తుల కోసం ఆయన చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ముకుందరావు పవార్, దయారామ్ పవార్, శివశంకర్‌రావు పవార్, పడోల్కర్ మహేశ్వరరావు, సదారామ్, సత్యనారాయణ, బాబు, దొరనాయుడు, రాము, నారాయణ, వెంకటేశ్వరరావు, ప్రైవేటు స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి పూజల కలకలం


పూజలు చేస్తున్న వారిని హెచ్చరిస్తున్న పోలీసు

చంద్రగిరి: మండలంలోని మల్లయ్యపల్లె సమీపంలో ఉన్న ధనేశ్వరమ్మ ఆలయంలో ఆదివా రం అర్ధరాత్రి కొందరు పూజలు నిర్వహించడం స్థానికంగా కలకలం రేపింది. ఆలయంలోని రాత్రివేళ అరుపులు, కేకలు వినిపించడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి పోలీసులు చేరుకుని పూజలు చేస్తున్న వారిని విచారించారు. తమ కుటుంబీకులకు ఆరోగ్యం సరిగా లేదని, ఈ సమయంలో అమ్మవారిని పూజిస్తే నయమవుతుందనే విశ్వాసంతో వచ్చినట్లు తెలిపారు. అయితే అర్ధరాత్రి వేళ ఎలాంటి అనుమతులు లేకుండా ఆలయంలోకి ప్రవేశించి పూజలు చేయడం సరికాదని, ఇలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించి వారిని పంపేశారు.

గదుల వేలం.. పంచాయతీకి ఆదాయం

నాగలాపురం: మండల కేంద్రమైన నాగలాపురం గ్రామం మేజర్ పంచాయతీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు గ్రామ పంచాయతీకి ఆదాయం వచ్చే నూతనంగా నిర్మించిన నాలుగు షాపింగ్ గదులు, సన్నిధి వీధిలోని మూడు గదులను సర్పంచ్ చిన్నదొరై సుధా ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో ఆయన మాట్లాడుతూ 2025 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2026 మార్చి 31 వరకు ఏడు నెలలకు షాపులు నడిపేందుకు గానూ పంచాయతీకి రూ.4.27 లక్షలు ఆదాయం సమకూరిందన్నారు. ఈ వేలంలో గ్రామ పంచాయతీలోని ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు వివిధ వ్యాపార వర్గాలు, వ్యాపారస్తులు ముందస్తుగా డిపాజిట్లు కేటాయించి, సాల్వెన్సీ సర్టిఫికెట్లు పొంది వేలంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శేఖర్, డిప్యూటీ ఎంపీడీఓ మునిరత్నం, పంచాయతీ శంకరయ్య, ఉప సర్పంచ్ సునీత, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

చట్టాలపై అవగాహన

వెంకటగిరి రూరల్: పట్టణంలోని మల్లమ్మగుడి ప్రాంతంలో ఉన్న గిరిజన కాలనీలో న్యాయవాద సంఘం ఉపాధ్యక్షుడు అద్దంకి గాంధీ, రెంటాల వాసు ఆధ్వర్యంలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ వెంకటగిరి జూనియర్ సివిల్‌జడ్జి విష్ణువర్మ ఆదేశాల మేరకు గిరిజన ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. బాల్యవివాహాలు నిర్మూలించాలన్నారు. గిరిజనలకు ఎన్నో ప్రత్యేక రిజర్వేషన్లు, చట్టాలు అమల్లో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ అధికారి సునీత తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

ఆర్టీసీ డీఎం మొండి వైఖరి విడనాడాలి

గూడూరురూరల్: గూడూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు మొండి వైఖరిని విడనాడి కార్మికులకు అండగా నిలవాలని ఎస్‌ఎంయూ నాయకులు గూడూరు డిపో ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ కండక్టర్ శ్రావణ్‌కుమార్‌ను చిన్నపాటి కారణంగా సస్పెండ్ చేయడం ఎంత వరకు సబబని అన్నారు. సస్పెండ్ చేసిన కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జోనల్ చీఫ్ అడ్వయిజర్ ఎస్‌కేఎం అహ్మద్, జీఎస్ వాసులు, కే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

పలు ఆలయాల్లో పవిత్రోత్సవాలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : నారాయణవనంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా వెలసిన మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి గుడిలో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. సోమవారం ఈ మేరకు టీటీడీ ఓ ప్రకటన విడుదల చేసింది.అలాగే పరాశరేశ్వరస్వామి ఆలయంలో సెప్టెంబరు 4 నుంచి 6వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరిపించనున్నట్లు పేర్కొంది. ఈ క్రమంలోనే వైఎస్సార్ జిల్లా దేవుని కడపలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సైతం సెప్టెంబరు 5 నుంచి 7వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది.

భవనం కూల్చివేతపై పునరాలోచిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : గాంధీ రోడ్డులోని హథీరాంజీ మఠం భవనం కూల్చివేతపై పునరాలోచిస్తామని, కమిటీ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, ప్రజా ప్రతినిధులు, దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ హథీరాంజీ మఠం భవనాన్ని ప్రత్యక్షంగా పరిశీలించినట్లు తెలిపారు. పునరాలోచించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా నిర్మిస్తామని వెల్లడించారు. సమావేశంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ బోర్డు చైర్మన్ సుగుణమ్మ, అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వూకా విజయకుమార్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మఠం ఏఓ బాపిరెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్ పాల్గొన్నారు.

మహిళా సమైఖ్య నూతన కార్యవర్గం

నారాయణవనం: మండల మహిళా సమైఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం స్త్రీ శక్తి భవనంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండల సమైఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రామతులసి, కార్యదర్శిగా చంద్రప్రియ, కోశాధికారిగా జ్యోతి, ఉపాధ్యక్షులుగా రేవతి, సహాయ కార్యదర్శిగా లక్ష్మిని ఎన్నుకుని, ఆర్థిక రుణ ప్రణాళికను తయారు చేసుకున్నారు. సమావేశంలో గత వార్షిక సంవత్సరంలో ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఏపీఎం ధనుంజయరెడ్డి మాట్లాడుతూ ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగడానికి ఆర్థిక చేయూత అందించడానికి మహిళా సమైఖ్య సిద్ధంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలతో కూడిన పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళా సంఘ సభ్యురాలు ఆర్థికంగా ఎదగాలని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, ఫుడ్ ప్రొడక్ట్, జూట్ బ్యాగులు, నిల్వ పచ్చళ్లు, అప్పడాల తయారీ, ఎంబ్రాయిడరీలపై శిక్షణ ద్వారా మెలకువలు నేర్చుకుని వాటికి ప్యాకింగ్, బ్రాండింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డైరీ ఏపీఎం సుదర్శన్ రాజు, శ్రీనిధి మేనేజర్ షేక్ ఆదిల్ బాషా, సీసీలు నాగేందర్ రావు, రాజేశ్వరి, అరుణ్ కుమార్, నిమ్మి, అకౌంటెంట్ మల్లిక, శ్రీజ, సూపర్ వైజర్ శరత్, డ్వాక్రా సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.


ఏకగ్రీవంగా ఎన్నికైన మహిళా సమైఖ్య కార్యవర్గం